క్లుప్తంగా

మండల పరిషత్ సాధారణ సమావేశం వాయిదా

రంగంపేట: ఈ నెల 11వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు జరగాల్సిన మండల పరిషత్ సాధారణ సమావేశం అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్టు ఎంపీడీఓ బి.శ్రీరామరాజు శనివారం తెలిపారు. సమావేశం మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

సోమేశ్వరస్వామికి జలాభిషేకం



సోమేశ్వరస్వామి ఆలయంలో జలాభిషేకం పూజల్లో పాల్గొన్న భక్తులు

పెదపూడి: మండల కేంద్రం పెదపూడి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్యామలాంబ సమేత సోమేశ్వర స్వామివారికి మృగశిరకార్తి ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శనివారం జలాభిషేకం నిర్వహించారు. గ్రామంలో గల జనార్ధన స్వామివారి ఆలయం వద్ద 108 మంది మహిళలు బిందెలతో వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కె.వెంకట్రావు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులు సమర్పించిన జలాన్ని అభిషేకించారు. అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

15న బాబా మందిర వార్షికోత్సవం

రాజానగరం: అన్నదాన సాయిగా పేరొందిన స్థానిక షిరిడీ సాయిబాబా మందిరం 22వ వార్షికోత్సవాన్ని ఈ నెల 15వ తేదీన వైభవంగా నిర్వహించనునన్నారు. వేకువజామున ఇచ్చే కాకడ హారతి అనంతరం మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహిస్తారు. ఉదయం 8.15 గంటల నుంచి అఖండ బిల్వార్చన జరుగుతుంది. మధ్యాహ్న హారతి అనంతరం అన్నసమారాధన ఉంటుంది.

నేడు కుంతీదేవి జాతర



ప్రత్యేక అలంకరణలో కుంతీదేవి

పెదపూడి: మండల కేంద్రం పెదపూడి గ్రామంలో కుంతీదేవి జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు స్థానిక అంబేడ్కర్ యూత్ తెలిపారు. 9 ఏళ్ల తరువాత నిర్వహిస్తున్న ఈ ఉత్సవంలో జాతర, అమ్మవారి ఊరేగింపు రెండు రోజుల పాటు జరుగుతాయన్నారు. మండల నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ఉత్సవం సందర్భంగా ఆలయం వద్ద విద్యుత్ కాంతులతో అలంకరించారు.

18 నుంచి డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 18 నుంచి అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి తెలిపారు. బీఏ హానర్స్‌లో స్పెషల్ తెలుగు, ఎకనామిక్స్, పాలిటిక్స్, బీఎస్సీ హానర్స్‌లో మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, కంప్యూటర్ సైన్స్, బీకాం హానర్స్ కంప్యూటర్ అప్లికేషన్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు.

రైతు బజార్ నిర్మాణానికి సహకరించాలి



కడియం పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న గిరజాల వీర్రాజు

కడియం: స్థానిక కైలాసభూమి ఎదురుగా ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ స్థలంలో రైతు బజార్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు గిరజాల వీర్రాజు కోరారు. ఈ మేరకు ఆయన శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. టెండర్ ద్వారా నిర్మిస్తున్న రైతు బజార్ షెడ్ల నిర్మాణం ఎన్నికల కోడ్ కారణంగా తాత్కాలికంగా నిలిపివేశారన్నారు. ఎన్నికల కోడ్ ముగియడంతో రెండు రోజుల్లో పనులు ప్రారంభించేందుకు సమాయత్తమవుతున్నారన్నారు. అయితే పనులు నిమిత్తం తీసిన గోతులను కొందరు కావాలనే పూడ్చివేస్తున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. తాను స్వయంగా అక్కడకు వెళ్లేసరికి అక్కడ గోతులు పూడుస్తున్నవారు పనులు ఆపివేశారన్నారు. జరుగుతున్న పనులకు ఆటంకం కలిగించేలా వ్యవహరించిన వ్యక్తులపై తగు చర్యలు తీసుకోవాలని కడియం పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు.

చిటికెలో పేమెంట్

- ఎక్కడ చూసినా డిజిటల్ లావాదేవీలు
- ఆన్‌లైన్ పేమెంట్లకు ఆదరణ



కిరాణా షాపులో కనిపిస్తున్న స్కానర్



నగరంలోని ఓ తోపుడు బండిపై డిజిటల్ లావాదేవీల స్కానర్

సీటీఆర్ఐ: గతంలో ఇంటి నుంచి బయటకు వచ్చే ముందుకు జేబులో డబ్బులు పెట్టుకుని వచ్చేవాళ్లం. బయట పనులపై తిరగడానికి ఎంత అవసరమవుతుందో ముందే అంచనా వేసుకుని తీసుకువచ్చేవాళ్లం. కానీ ఇప్పుడు కాలం మారింది. అంతా డిజిటల్‌మయంగా మారింది. జేబులో రూపాయి లేకపోయినా స్మార్ట్‌ఫోన్, మన ఖాతాలో డబ్బులు ఉంటే చాలు. దానితోనే ప్రతి లావాదేవీని సులభంగా చేయవచ్చు. కావాల్సిన వస్తువులు కొనాలన్నా, నచ్చిన ఫుడ్ తిన్నాలన్నా, డబ్బులు పంపాలన్నా, మనం తీసుకోవాలన్నా అంతా చిటికెలో అయిపోతుంది. గతంలో మాల్స్, పెద్ద వ్యాపార సంస్థలకే పరిమితమైన డిజిటల్ పేమెంట్లు ఇప్పుడు రోడ్డు పక్కన దుకాణాలు పెట్టే చిరు వ్యాపారులు చెంతకూ వచ్చేశాయి. పట్టణాలతో పాటు గ్రామాలకు విస్తరించాయి. డిజిటల్ లావాదేవీలకు అవసరమైన స్కానర్ లేకుండా ఏ వ్యాపారినీ చూడలేము.

కోవిడ్ అనంతరం మార్పులు

దేశంలో 2016లో పెద్దనోట్ల రద్దు జరిగింది. ఆ తర్వాత ఆర్థిక లావాదేవీలలో ఇబ్బందులను అధిగమించేందుకు డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించారు. కానీ అవి పెద్ద వ్యాపార సంస్థలకు మాత్రమే పరిమితమయ్యాయి. నగదు వేరే వారి ఖాతాల్లోకి వెళ్లిపోతుందన్న అపోహలు, ఆర్థిక మోసాలు జరుగుతాయన్న ఆందోళనతో గ్రామాల్లో వీటిజాడ పెద్దగా కనిపించేది కాదు. కోవిడ్ అనంతర పరిణామాలతో నగదు రహిత లావాదేవీలతో గణనీయమైన మార్పులు వచ్చాయి.

అన్నిచోట్లా ఆన్‌లైన్ చెల్లింపులే..

ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, అమోజాన్‌పే తదితర పేమెంట్ యాప్ సేవలతో అన్నిచోట్లా ఆన్‌లైన్ చెల్లింపులు పెరిగాయి. కిరాణా, ఫ్యాన్సీ, మందులు, పెట్రోల్ బంకులు, ఇతర నిత్యావసర వస్తువుల దుకాణాలతో పాటు మొబైల్, డీటీహెచ్ రీచార్జులు, విద్యుత్, గ్యాస్ బిల్లులు, ఇతర ఆర్థిక లావాదేవీలు చాలా వరకూ ఈ యాప్‌ల నుంచి జరుగుతున్నాయి.

చిరు వ్యాపారులకు చెంతకు..

టీ స్టాళ్లు, రోడ్డు పక్కన హోటళ్లు, తోపుడు బండ్లు, సైకిల్‌పై విక్రయాలు చేసే వారందరూ ఆన్‌లైన్ చెల్లింపులు ప్రోత్సహిస్తున్నారు. వీటి వల్ల ప్రధానంగా చిల్లర సమస్య ఉండడం లేదు. డిజిటల్ పేమెంట్లతో చిల్లర సమస్యకు పరిష్కారం లభించింది. పేమెంట్ యాప్‌లకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌లను ఆయా సంస్థల ఏజెంట్లు క్షణాల్లో అందజేస్తున్నారు. ఇప్పుడు ఏ దుకాణం వద్ద చూసిన క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు, బోర్డులు దర్శనమిస్తున్నాయి.

డిజిటల్ బ్యాంకింగ్

బ్యాంకుల్లో కూడా డిజిటల్ బ్యాంకింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. నగదు లావాదేవీలు చాలా వరకూ తగ్గిపోయాయి. వినియోగదారులు అధికంగా క్యాష్‌లెస్ ట్రాన్సాక్షన్లు చేస్తూ ఇంటి నుంచే అన్ని రకాల సేవలు పొందుతున్నారు.

స్పీకర్ బాక్స్‌లతో మోసాలకు చెక్

ఆన్‌లైన్ చెల్లింపుల్లో ఉపయోగాలతో పాటు ఆదమరిస్తే మోసానికి గురయ్యే అవకాశం ఉంది. వీటిపై అవగాహన లేని వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని కొందరు మాయగాళ్లు మోసాలకు పాల్పడుతుంటారు. సరకులను కొనుగోలు చేసిన తర్వాత వేరే వారికి అమౌంట్ బదిలీ చేస్తారు. సెల్‌ఫోన్ స్క్రీన్‌పై వచ్చిన ట్రాన్సాక్షన్ సక్సెస్‌ఫుల్ మెసేజ్‌ను దుకాణదారుకే అమౌంట్ పే చేసినట్టు చూపించి అక్కడి నుంచి జారుకుంటారు. అయితే మార్కెట్లోకి వచ్చిన క్యూఆర్ కోడ్ స్పీకర్ బాక్స్‌లు ఇటువంటి అక్రమాలకు చెక్ పెడుతున్నాయి. ఆన్‌లైన్ చెల్లింపు జరగ్గానే ఎంత మొత్తం దుకాణదారుఖాతాకు జమ అయ్యిందనే విషయం స్పీకర్‌లో బయటకు వాయిస్ రూపంలో వినిపిస్తుంది. దీంతో డిజిటల్ మోసాలకు అడ్డుకట్టు పడుతుందని వ్యాపారులు చెబుతున్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి ఊరేగింపు



స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

సీటీఆర్ఐ: లాలాచెరువు వద్దగల గోవిందక్షేత్రంలోని స్వామివారి ఉత్సవమూర్తిని శనివారం ఘనంగా ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. గోవిందక్షేత్రం 14వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 5వ తేదీ నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం విష్ణు సహస్రనామ పారాయణ, తిరువీధి ఉత్సవం, గరుడ సేవ జరిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు మట్టపల్లి రంగప్రసాద్, మట్టపల్లి రామ్‌కుమార్, సురేష్ కుమార్, బలభద్ర వెంకటరాజు, లక్ష్మణస్వామి, ఆలయ అర్చకులు శ్రీమన్నారాయణ, రమేష్, భక్తులు పాల్గొన్నారు.

30న ఆర్యవైశ్య ఎంసెట్ ర్యాంకర్లకు సత్కారం

రాజమహేంద్రవరం సిటీ: ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులను ఈ నెల 30న హైదరాబాద్‌లో సత్కరిస్తున్నట్లు ఆర్యవైశ్య ఆఫీసర్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాజమహేంద్రవరం శాఖ ప్రతినిధి సూరపురెడ్డి తాతారావు తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ 2024లో ఏపీ, తెలంగాణ ఎంసెట్, నీట్, జేఈఈ (అడ్వాన్స్‌డ్) ప్రవేశ పరీక్షలు రాసి, మొదటి వెయ్యి ర్యాంకులు సాధించిన వారిలో వంద మంది ఆర్యవైశ్య విద్యార్థులను స్వర్ణ పతకాలతో సత్కరిస్తామన్నారు. ఆసక్తి కల విద్యార్థులు ఆన్‌లైన్‌లో పూర్తి చేసిన ఫారం హార్డ్ కాపీకి ఫొటో, ఇతర పత్రాలు జతపరిచి, ఈ నెల 20వ తేదీలోపు పీవీ రమణయ్య, ఫ్లాట్ నెంబర్ 3–81/202, విజేత విహార్ అపార్ట్‌మెంట్, చైతన్యపురి, హైదరాబాద్ – 500060, తెలంగాణ అనే చిరునామాకు పంపించాలన్నారు. మరిన్ని వివరాలకు అధ్యక్షుడు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ పీవీ రమణయ్య, కె.రామానందంను 94419 28528, 92905 29133 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సత్యనారాయణరాజు సేవలు చిరస్మరణీయం



సత్యనారాయణరాజు భౌతికకాయానికి పుష్పాంజలి ఘటిస్తున్న భట్రాజుల సంఘం నాయకులు

సీటీఆర్ఐ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా భట్రాజు సంఘానికి గౌరవ సలహాదారుడిగా విశిష్ట సేవలు అందించిన సత్యనారాయణరాజు అకాల మృతి సంఘానికి తీరని లోటని తూర్పుగోదావరి జిల్లా భట్రాజుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు, సేవారత్న లోల భట్టు శ్రీనివాసరాజు అన్నారు. కాకినాడలో శనివారం చుక్కన సత్యనారాయణరాజు పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా పెన్షనర్ల అసోసియేషన్‌కు, భట్రాజుల సంఘానికి ఎన్నో సేవలు అందించారన్నారు. యూటీఎఫ్ ఉపాధ్యాయ ఉద్యమ నేతగా అనేక సేవలందించారని కొనియాడారు.

కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుంది



జి.మామిడాడలో పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని, ప్రతి కార్యకర్త ధైర్యంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. జి.మామిడాడ గ్రామంలోని పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులపై బీజేపీ శ్రేణులు దాడులు చేయడం అన్యాయమన్నారు. బీజేపీ శ్రేణులు అభివృద్ధి పనుల శిలాఫలకాలు, ప్రభుత్వ ఆస్తులు, భవనాలు ధ్వంసం చేయడం అధికార పార్టీ నాయకుల అవివేకమన్నారు. ఇటీవల వచ్చిన ఎన్నికల ఫలితాల్లో పార్టీ ఓటమిపై విశ్లేషణ చేసుకుని నాయకులు, కార్యకర్తలు సంఘటితంగా ఉండాలన్నారు. పార్టీ నాయకులు సంఘీభావంగా ఉంటూ కార్యకర్తలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. ప్రతి గ్రామంలో పార్టీ నాయకులు కమిటీలుగా ఏర్పడి అధికార పార్టీ దాడుల్లో గాయపడిన వారికి అండగా నిలవాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో గ్రామాల్లో పోలీసు పికెట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి, మండల కన్వీనర్ గుత్తుల రమణ, పార్లమెంటు నియోజకవర్గం బీసీ సెల్ కన్వీనర్ కేతా శ్రీనివాస్, సూర్యనారాయణ రెడ్డి, కోసూరి వాసు, కర్రి శ్రీవెంకటరెడ్డి, కోనాల శ్రీనివాస్‌రెడ్డి, నాగుమళ్ల వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



పందలపాక ఉన్నత పాఠశాలలో కలుసుకున్న 2000-01 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో శ్రీపడాల పెదపుల్లారెడ్డి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 2000–2001 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. జీవన గమనంలో ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా సుమారు 24 ఏళ్ల తరువాత తాము చదువుకున్న పాఠశాలలోనే తిరిగి కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు కోనాల సత్తిరాజు, వైబీఎస్ ఆచార్యులు, శర్మ, గెరటారెడ్డి, సురేష్, సుబ్బారెడ్డి, శ్రీనివాస్ తదితరులను సత్కరించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన పడాల కృష్ణారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆత్మీయ సమ్మేళనంలో జెట్టి మెహర్ ప్రసాద్, మల్లిరెడ్డి దుర్గాప్రసాద్, జామి సత్యనారాయణ, దిలీప్, సాగర్, గేదెల సత్యనారాయణ, యాసలపు సీతారామయ్య, బొడ్డు సత్తిబాబు, అరుణ, దేవి, శ్రీదేవి, మమత, నాగేశ్వరరావు, కారంపూడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దాసరి కార్పొరేషన్ పదవికి డాక్టర్‌బాబు రాజీనామా



పెదపాటి రమేష్‌బాబు

సీతానగరం: రాష్ట్ర దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా చేశానని వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి రమేష్ బాబు (డాక్టర్ బాబు) తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం మారిందని, దానితో తన పదవికి రాజీనామా చేశానని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధితో రాష్ట్ర ప్రగతికి జగన్ పాటుపడ్డారన్నారు. రాజానగరం నియోజకవర్గంలో ప్రతి క్షణం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించిన జక్కంపూడి రాజా ఓటమి చెందడం మనస్తాపం కలిగించిందన్నారు. రాజీనామా పత్రాన్ని సంబంధిత అధికారులకు అందజేసినట్లు తెలిపారు.

పీఏసీఎస్ త్రిసభ్య కమిటీల రాజీనామా

రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో మండలంలోని పలు ప్రాథమిక సహకార వ్యవసాయ పరపతి సంఘాల (పీఏసీఎస్) త్రిసభ్య కమిటీలు శనివారం రాజీనామాలు చేశాయి. రామచంద్రపురం పీఏసీఎస్ చైర్పర్సన్ కొండిపాటి కోటేశ్వరరావు, పర్సన్లు చింతలపూడి ముత్యాలరావు, దోని కాంతమ్మ, సీతానగరంలో మట్ట వీరభోగ వసంతరావు, మట్ట సుబ్బారావు, చిరికి వెంకటరమణ, చినకొండేపూడిలో పోలినాటి రామచంద్రరావు, జంపన సూర్యనారాయణ రాజు, పుటాల వెంకటేశ్వరరావు, రాపాకలో పిచ్చుకల రవి కుమార్, ముత్యాల సత్తిబాబు, మాగంటి హరి బాబు, రఘుదేవపురంలో నిడదవోలు శ్రీనివాస్, ఎలుగుబంట్ల శేషారత్నం, చిట్టూరి శ్రీనివాస్ తమ పదవులకు రాజీనామాలు చేశారు.

కెనాల్ రోడ్డును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తాం



రహదారుల పరిస్థితిపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి: రాజమహేంద్రవరం–కాకినాడ కెనాల్ రోడ్డును పూర్తి స్థాయిలో అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో రహదారుల పరిస్థితిపై శనివారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులు, నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన అసిస్టెంట్ ఇంజినీర్లతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కెనాల్ రోడ్డు పరిస్థితిపై అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ముందుగా కెనాల్ రోడ్డు మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా అధ్వానంగా ఉన్న సింగంపల్లి–రంగంపేట రోడ్, పెదపూడి మండలం జి.మామిడాడ పరిధిలో కొంతమేర మిగిలిన రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి సహకారంతో కెనాల్ రోడ్డు పూర్తి స్థాయి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వంతో చర్చించి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ కార్యదర్శిగా ఎస్ఆర్ఆర్ రాము



ఎస్ఆర్ఆర్ రాము

అనపర్తి: ఆంధ్రప్రదేశ్ పౌల్ట్రీ ఫెడరేషన్ కార్యదర్శిగా అనపర్తికి చెందిన మల్లిడి రామకృష్ణారెడ్డి(ఎస్ఆర్ఆర్ రాము) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం విజయవాడలో జరిగిన పౌల్ట్రీ ఫెడరేషన్ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. అనపర్తి ప్రాంతీయ పౌల్ట్రీ రైతుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘకాలం సేవలందించిన ఎస్ఆర్ఆర్ రాము రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై పలువురు ప్రముఖులు ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అనపర్తి ప్రాంతీయ కోళ్ల రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డి, నెక్ జోన్ జిల్లా చైర్మన్ కె.వెంకట ముకుందరెడ్డి, పౌల్ట్రీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సత్తి రామకృష్ణారెడ్డి, జీబీఆర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తేతల ఉపేంద్రరెడ్డి, కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కర్రి త్రినాథరెడ్డి, సంఘం యువజన విభాగం అధ్యక్షుడు తాడి చంద్రశేఖర్‌రెడ్డి, పలువురు పౌల్ట్రీ యజమానులు ఎస్ఆర్ఆర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



మాట్లాడుతున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ కరుణాసాగర్

- పేపర్ మిల్లు డీజీఎం సురేష్
- ఘనంగా వ్యవసాయ కళాశాల వార్షికోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, కష్టబడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆంధ్రా పేపర్‌మిల్లు ఫామ్ ఫారస్ట్రీ డీజీఎం డాక్టర్ బి.సురేష్ అన్నారు. కాతేరులోని వ్యవసాయ కళాశాల 16వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ జి.కరుణాసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సురేష్ మాట్లాడుతూ ఉజ్వల భవిష్యత్తుకు కళాశాలలోనే పునాదులు పడతాయన్నారు. మార్టేరు వ్యవసాయ సంయుక్త పరిశోధన సహాయ సంచాలకులు డాక్టర్ డి.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

పూర్తిస్థాయిలో సహకరిస్తాం

వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ జి.కరుణా సాగర్ మాట్లాడుతూ వ్యవసాయ కళాశాల నూతన భవనంలో విద్యార్థులకు తరగతులు నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కళాశాల అవసరమైన నిధులతో పాటు, హాస్టల్ భవనం, ల్యాబ్ తదితర సౌకర్యాలన్నింటికీ యూనివర్సిటీ ద్వారా పూర్తిస్థాయిలో సహకరిస్తామన్నారు. వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ మూర్తి కళాశాల ప్రగతిని వివరించారు. ప్రొఫెసర్ డాక్టర్ పీఎల్ఆర్‌జే ప్రవీణ కళాశాల గత సంవత్సరం నుంచి ఇప్పటివరకు విద్యార్థుల పురోగతిని, సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యాసంబంధమైన ప్రగతిని తెలిపారు. కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ మునిరత్నం మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ కలిగి భవిష్యత్తులో ఉన్నతస్థాయిలో ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వివిధ డిపార్ట్‌మెంట్లలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు.

నిమ్మ రైతుకు లాభాల సిరులు

- ఎకరాకు 80 బస్తాల దిగుబడి
- రూ.లక్ష నికర ఆదాయం
- మార్కెట్లో గిట్టుబాటు ధర
- రోజుకు 50 టన్నుల కాయల ఎగుమతి



దేవరపల్లి మండలం యాదవోలు మార్కెట్లో కొనుగోలు చేసిన నిమ్మకాయలు

దేవరపల్లి: నిమ్మ సాగుదారులకు లాభాల పంట పండింది. మూడేళ్లుగా గిట్టుబాటు ధర లభిస్తుండడంతో నిమ్మకాయల రైతులు ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. పెట్టుబడులు పోను ఎకరాకు సుమారు రూ.80 వేల నుంచి రూ.1 లక్ష వరకూ ఆదాయం పొందుతున్నారు. 2022 వ సంవత్సరం మార్కెట్లో కిలో కాయల రేటు రూ.150 నుంచి రూ.170 వరకూ పలికింది. అయితే ఈ ఏడాది దిగుబడులు చెప్పుకోదగిన లేకపోవడంతో రైతులకు అంతంత మాత్రం లాభాలే వచ్చాయి. ఆ ఏడాది ఎకరాకు 40 నుంచి 50 బస్తాల (బస్తాకు 50 కిలోలు) దిగుబడి వచ్చింది. 2023 సీజన్‌లో కిలో నిమ్మకాయలు రూ.60 నుంచి రూ.80 వరకూ ధర పలికినప్పటికీ దిగుబడులు తగ్గాయి. మార్కెట్లో మంచి ధరలు పలకడంతో రైతులు లాభాలతో ఒడ్డెక్కారు. ఇక 2024 సీజన్‌లో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. ఎకరాకు 80 నుంచి 100 బస్తాల దిగుబడి వచ్చినట్టు రైతులు తెలిపారు. కిలో కాయలకు రూ.70 రేటు లభించింది. ఈ ఏడాడి ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో ఈ ధర నిలకడగా కొనసాగడంతో రైతులకు మంచి లాభాలు వచ్చాయి. జూన్‌లో ఈ ధర రూ.30 నుంచి రూ.40 వరకూ పడిపోతుందని రైతులు అంచనా వేస్తున్నారు. అయినప్పటికీ ఇబ్బంది లేదని వారు భావిస్తున్నారు. ఎందుకంటే సాధారణంగా జూన్‌లో కిలో నిమ్మకాయల ధర రూ.10 మాత్రమే పలుకుతుందని, అయినప్పటికీ కొనే నాథుడు ఉండడని పేర్కొంటున్నారు.

కౌలు రైతులు ఖుషీ

నిమ్మ మార్కెట్ ఈ ఏడాది ఆదుకోవడంతో కౌలు రైతులు కూడా ఆనందంగా ఉన్నారు. ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ వరకూ నిమ్మకాయలకు మంచి సీజన్ ఉంటుంది. నిమ్మ ఏడాదికి మూడు పంటల దిగుబడి వస్తుంది. అయితే వేసవి మూడు నెలలూ వచ్చిన దిగుబడే రైతులను ఆదుకొంటుంది. మిగిలిన కాలంలో వచ్చిన నిమ్మ దిగుబడికి మార్కెట్లో ధర అంతంత మాత్రంగానే ఉంటుంది. ఒకొక్క సమయంలో కాయల కోత కూలి కూడా రావడం కష్టమవుతుంది.


ఎగుమతి కేంద్రంగా యాదవోలు

నిమ్మకాయల ఎగుమతి కేంద్రంగా దేవరపల్లి మండలం యాదవోలు మార్కెట్ గుర్తింపు పొందింది. రాష్ట్రంలోని గూడూరు, ఏలూరు మార్కెట్ల తర్వాత యాదవోలు మార్కెట్ నిమ్మకాయల ఎగుమతికి ప్రసిద్ధి. యాదవోలు నిమ్మ మార్కెట్ ఏర్పడి దాదాపు 25 ఏళ్లు అవుతోందని రైతులు తెలిపారు. అప్పటి నుంచి ఇక్కడ కొనుగోలు చేసిన నిమ్మకాయలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. పంట పండించే రైతు కుటుంబాల నుంచి కొందరు యువకులు కమిటీగా ఏర్పడి రైతుల నుంచి రోజూ కాయలు కొనుగోలు చేస్తారు. వాటిని ఎప్పటికప్పుడు కోల్‌కత్తా, ఢిల్లీ, గుజరాత్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లోని అమలాపురం, రావులపాలెం, గాజువాక, విశాఖపట్నం, కాకినాడ, ఇచ్ఛాపురం, టెక్కలి, ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. ఆ యువత ఈ మార్కెట్లో రైతుల నుంచి ఎలాంటి కమీషన్ తీసుకోకుండానే నిమ్మకాయలను కొనుగోలు చేస్తారు. రైతులే ఎగుమతి దారులు కావడం వల్ల గిట్టుబాటు ధర లభిస్తోంది.

20 గ్రామాల రైతులకు మేలు

యాదవోలు పరిసర గ్రామాల నుంచి రోజూ రైతులు తాము పండించిన పంటను యాదవోలు మార్కెట్‌కు తీసుకువచ్చి గిట్టుబాటు ధరకు అమ్ముకుంటున్నారు. రోజూ సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ మార్కెట్ జరుగుతుంది. రోజుకు 50 నుంచి 80 టన్నుల నిమ్మకాయలు కొనుగోలు చేస్తారు. సీజన్లో రోజుకు 80 టన్నుల కాయల విక్రయాలు జరుగుతుండగా, ప్రస్తుతం 50 టన్నుల కాయలు కొనుగోలు చేస్తున్నారు. కిలో కాయల ధర రూ. 30 నుంచి రూ. 40 పలుకుతున్నాయి. చుట్టుపక్కల 70 కిలో మీటర్ల దూరం నుంచి సుమారు 20 గ్రామాల రైతులు కాయలను తీసుకు వచ్చి విక్రయిస్తారు.

దిగుబడులు ఆశాజనకం



నిమ్మకాయల దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. ఎకరాకు 80 నుంచి 100 బస్తాల దిగుబడులు వచ్చాయి. మంచి డిమాండ్ కూడా ఉండడంతో రైతులకు ఎకరాకు రూ.1లక్ష నికర ఆదాయం వచ్చింది. కౌలు రైతులకు రూ.50 నుంచి 60 వేలు ఆదాయం వచ్చింది.సేంద్రియ ఎరువులు వాడితే మంచి దిగుబడులు వస్తున్నాయి. దీనివల్ల చెట్టు తెగుళ్లను తట్టుకుంటుంది. చెట్టు మొదట నవధాన్యాల విత్తనాలు వేసుకుంటే చెట్టుకు బలం చేకూరుతుంది. నేను రెండెకరాల్లో సేంద్రియ పద్ధతిలో నిమ్మపంట సాగు చేస్తున్నాను.

– సింగులూరి రామ్మోహనరావు, రైతు, యాదవోలు, దేవరపల్లి మండలం